సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 5 । జూలై । 2023



కడపకు అగ్రస్థానం

ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జట్టు అగ్రస్థానంలో నిలిచింది. పాయింట్ల పట్టికలో 12 పాయింట్లతో కడప అగ్రస్థానంలో నిలిచింది. - 8లో



విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ

జీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్‌లో మామిడిశెట్టి సోహిత్ (11)మృతి ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. ఎస్పీ అన్బురాజన్ వివరాలను వెల్లడించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1,220	రూ.1400
రెండోరకం	రూ.940	రూ.1200

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 615 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	380	435
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 879.08 కిలోలు

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె : బాలల సంక్షేమం, సంస్కరణల సేవలశాఖలో జిల్లా చైర్ మెంబర్లుగా, జువెనైల్ జస్టిస్‌బోర్డులలో సోషల్ వర్క్ మెంబర్లుగా సేవలందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అదనపు పర్యవేక్షణాధికారి లక్ష్మీపతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పూర్తి వివరాలను డబ్ల్యూడీసీడబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్స్ నుంచి పొందవచ్చన్నారు. అదనపు సమాచారం కోసం 9701386650 నంబరులో తనను సంప్రదించవచ్చన్నారు.

జాతీయసాహస అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి అర్బన్ : టెన్జింగ్‌నార్గే జాతీయసాహస అవార్డు కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా స్టెప్ ముఖ్యకార్యనిర్వహణాధికారిణి సాయిగ్రేస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డుకు 2020, 21, 22 సంవత్సరాల్లో భూమి,నీరు, గాలి వంటివాటిపై చేసిన సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయం సాధించిన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సాహస క్రీడల్లో తమను తాము అంకితం చేసుకుని నైపుణ్యం ప్రదర్శించిన వ్యక్తులకు జీవితకాల సాఫల్యం కింద ఈ అవార్డును ఏటా రాష్ట్రపతి చేతులమీదుగా బహుకరిస్తారని వివరించారు. అవార్డు గ్రహీతలకు టెన్జింగ్ నార్గే కాంస్య విగ్రహంతో పాటు ప్రశంసాపత్రం, 15లక్షల రూపాయల నగదు అందిస్తారన్నారు. అర్హులైన వారు ఈనెల 14లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు కోడూరు వాసి



ఉమేష్ రిషి

రైల్వేకోడూరు అర్బన్ : దుబాయ్‌లో ఈనెల 30 నుంచి ఆగస్టు 5 వరకు జరిగే అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు కోడూరు యువకుడు ఉమేష్ రిషి ఎంపికయ్యాడు. పట్టణంలోని కొత్తబజార్‌లో నివాసం ఉంటున్న శోడిశెట్టి శేషు కుమారుడు ఉమేష్ రిషిని మంగళవారం పలువురు క్రీడాభిమానులు అభినందించారు, ఈసందర్భంగా తండ్రి శేషు మాట్లాడుతూ మేనెల 26, 27, 28 తేదీలలో సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఏపీ తరవున దుబాయ్‌లో జరిగే పోటీలకు ఎంపికయినట్లు వివరించారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

కడప అగ్రికల్చర్: ప్రభుత్వం మత్స్యకారులకు కోసం అమలు చేసే పథకాలను సకాలంలో అందచేసి వారి అభివృద్ధికి కృషి చేయాలని ఏపీ ఉద్యానశాఖ ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి సూచించారు. మంగళవారం కడపలోని మత్స్యశాఖ కార్యాలయాన్ని సందర్శించి సంబంధిత శాఖలో అమలవుతున్న పథకాలపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి నాగలింగాచార్యులు, మత్స్య అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ

కడప రూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు మంగళవారం కడప నగరంలోని చెన్నై చిల్డ్రన్స్ ఆసుపత్రి, రెమిడి మల్టీ స్పెషాలిటీ, దీపేష్ తదితర ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమ్యూనికబుల్ డిసీజెస్ (అంటువ్యాధులు) మలేరియా, టైఫాయిడ్, కామెర్లు, చికెన్‌గున్యా తదితర వ్యాధులతో వచ్చే వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన రోగుల వివరాలను ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్ ఫామ్‌లో రిపోర్ట్‌ను పొందుపరచాలని పేర్కొన్నారు. ఎపిడమాలజిస్ట్ ఖాజామొహిద్దీన్, పాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడికక్కడే...అప్పటికప్పుడే..



ఇతని పేరు కోనేటి రవికుమార్. సంబేపల్లి మండలంలోని నామాలగుట్ట. ఇతను రాళ్లుకొట్టుకుంటూ, సమయం ఉన్నప్పుడు డ్రైవింగ్‌కు వెళ్లేవాడు.తనకు వాహన మిత్రకు కుల ధ్రువీకరణ పత్రం అవసరం వచ్చింది. జగనన్న సురక్షలో కార్యక్రమంలో భాగంగా సంబంధించిన వలంటీర్ రవికి ఈ పత్రం అవసరమని గుర్తించాడు. దరఖాస్తు చేసిన గంటల వ్యవధిలో రూపాయి ఖర్చులేకుండా కులధ్రువీకరణ పత్రం రవికి అందజేశారు.



ఈమెపేరు సుకన్య. లక్కిరెడ్డిపల్లి మండలం అనంతపురం గ్రామం. ఈమె గతంలో ఇన్‌కమ్, క్యాస్ట్ సర్టిఫికెట్ కోసం లక్కిరెడ్డిపల్లె ఎంఆర్‌ఓ ఆఫీసుకు పలుమార్లు తిరిగింది. ప్రస్తుతం గ్రామంలోనే వలంటీర్లు జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా సర్టిఫికెట్లు అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు చెబుతోంది.



ఈమెపేరు జ్యోతి. లక్కిరెడ్డిపల్లి మండలం ఈడిగపల్లె. ఈమెకు గతంలో ఇన్కమ్, క్యాస్ట్ సర్టిఫికెట్ అందలేదు. గ్రామ వలంటీర్ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈమె పేరు నమోదు చేసుకొని సర్టిఫికెట్లు అందజేయడంతో ఆమె ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి.

జనసురక్ష

- జగనన్న సురక్షతో గంటల వ్యవధిలోనే సమస్యల పరిష్కారం
- జిల్లాలో మొత్తం 59,537 దరఖాస్తుల స్వీకరణ
- 50,432 సమస్యల పరిష్కారం
- ఇప్పటికే 2,18,130 ఇళ్లల్లో పూర్తయిన సర్వే



రైల్వేకోడూరు : ధృవీకరణ పత్రాలను అందిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

సాక్షి రాయచోటి : జగనన్న సురక్ష ప్రజలకు రక్షగా మారింది. అడగందే అమ్మయినా అన్నం పెట్టదనే నానుడి ఉంది. అయితే ఇంటింటికి వెళ్లి సమస్య తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరిస్తుండమే కుటుంబానికి పెద్ద రక్షగా మారింది. సమస్య ఏదైనా ఆఘమేఘాల మీద పరిష్కారం లభిస్తోంది. సమస్య చెప్పిన వెంటనే సచివాలయం ద్వారా అధికారులకు పంపడం, ఉన్నతాధికారుల పరిశీలన.. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణతో గంటల వ్యవధిలోనే దానికి ముగింపు లభిస్తోంది.

ఎక్కడికక్కడే...అప్పటికప్పుడే....

అన్నమయ్య జిల్లాలో జగనన్న సురక్ష పథకం ద్వారా ఎప్పటికప్పుడు అక్కడికక్కడే సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. రోజుల తరబడి కాకుండా గంటల వ్యవధిలోనే 11 రకాల సర్టిఫికెట్లకు సంబంధించి జిల్లాలో సర్వే చేసిన ఇళ్ల పరిధిలోని వారికి అందించారు. జిల్లాలోని 280 సచివాలయ పరిధిలో 59,537 దరఖాస్తులు రాగా, అందులో 50,432 పరిష్కారానికి నోచుకున్నాయి. వీటిలో అనేక రకాల సమస్యలతోపాటు ఆదాయం, కుల, ఫ్యామిలీ, నివాస, లీగల్ తదితర 11 రకాల సమస్యలకు పరిష్కారం లభించింది. 84.7 శాతం మేర ఫలితాన్ని ప్రజలకు అందించగా, ప్రస్తుతం 9,105 పెండింగ్ దరఖాస్తులు కూడా పరిశీలనలో ఉన్నాయి.

అధికారుల ప్రత్యేక పర్యవేక్షణ

జిల్లాలో జగనన్న సురక్ష పథకాన్ని అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకు వెళుతున్నారు. నెల రోజులపాటు యుద్ధంలా జరిగే ఈ కార్యక్రమానికి కిందిస్థాయి వలంటీర్లు మొదలుకొని జిల్లా స్థాయి అధికారుల వరకు పరిశీలిస్తున్నారు. ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ జిల్లా స్థాయి అధికారులను మండలానికి ఒకరు చొప్పున ప్రత్యేక అధికారిగా నియమించారు. సమస్యలను వేగవంతంగా పరిష్కరించేలా పథక రచన చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని పతిష్టాత్మకంగా అమలు చేయాలని చెప్పడంతో అధికారులంతా పల్లె, పట్టణాల్లో ప్రజల వద్ద తిరుగుతున్నారు. దీంతో ఎక్కడికక్కడ సమస్యలకు పరిష్కారం లభిస్తుండటం మంచి ఫలితాన్నిస్తోంది.

ఇప్పుడు అన్నీ ఇంటివద్దకే వస్తున్నాయి



నాపేరు గంగాదేవి. సంబేపల్లె మండలం నామాల గుట్ట. జగనన్నసురక్ష సర్వేలో మా ఇంటికి వలంటీరు వచ్చారు. ఏమైనా ధ్రువీకరణ పత్రాలు కావాలా అని అడిగారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలని అడిగాను. గ్రామంలో నిర్వహించిన సమావేశానికి పిలిపించి ఉచితంగా ధ్రువపత్రాలను అందజేశారు.ఈ ప్రభుత్వంలో అన్నీ ఇంటి వద్దకే వస్తున్నాయి.

ఇంటి వద్దకే సేవలతో ఆనందంగా ఉంది



మాకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఎంతో తోడ్పాటునిస్తున్నాయి. సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను అందించడం ఇంకా ఆనందంగా ఉంది. నేను కుల ధ్రువీకరణ పత్రానికి నాలుగు రోజులక్రితం నమోదు చేసుకున్నాను. జగన్న సురక్ష కార్యక్రమంలో అధికారులు అప్పటికప్పుడు దరఖాస్తు పరిశీలించి మంజూరు చేసి చేతికి ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది.

– యామల అంజమ్మ, బి వడ్డిపల్లి, రైల్వేకోడూరు మండలం, అన్నమయ్య జిల్లా

సర్టిఫికెట్ల కోసం ఆఫీసు చుట్టూ తిరిగే వాళ్లం

ఈమె పేరు షేక్ రహమతున్నీసా. సిద్దవటం పంచాయతీ ఎగువపేట. వారి పిల్లలకు కులం, ఆదాయం సర్టిఫికెట్ కావాలంటే గతంతో ఆఫీసుల చుట్టూ తిరిగేవాళ్లు. అధికారులు, సిబ్బంది ఒకరుంటే ఒకరుండేవారు కాదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పెట్టడంతో వలంటీరు వీరి ఇంటికి వెళ్లి 7వ తరగతి చదువుతున్న కుమారుడు షేక్ మౌలాలికి కులం, ఆదాయం సర్టిఫికెట్లకు అర్జీలు తీసుకున్నాడు. ఈనెల 1వ తేదీ సభ పెట్టి సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశారు. ప్రభుత్వానికి, జగనన్నకు రహమతున్నీసా ధన్యవాదాలు తెలుపుతోంది.



అధికారుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు తీసుకుంటున్న రహమతున్నీసా

సత్వర పరిష్కారం



జగనన్న సురక్ష పథకాన్ని అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పరిశీలన చేస్తున్నారు. ప్రజలకు ఎంత ఎక్కువ వేగంగా వీలైతే అంత వేగంగా సమస్యను పరిష్కరిస్తున్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున అనేక రకాల సర్టిఫికెట్లను అందించాం. అనేక సమస్యలకు పరిష్కారం చూపాం. ఎప్పుడూ లేని తరహాలో ప్రజలకు విస్తృత సేవలు అందుతున్నాయి.

– పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్, అన్నమయ్య జిలాల

విద్యార్థుల వివరాలు తప్పనిసరి

- 'చైల్డ్ ఇన్ఫో డాట్ కాం'లో పూర్తి వివరాలు నమోదు చేయండి
- ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపల్ సమావేశంలో కలెక్టర్ కలెక్టర్ గిరీషా పీఎస్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థుల వివరాలను చైల్డ్ ఇన్ఫో డాట్‌కాంలో పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. మంగళవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలో ఓ ప్రైవేట్ కళ్యాణ్ మండపంలో ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లతో ఇంటర్‌లో విద్యార్థుల చేరిక, చైల్డ్ ఇన్ఫో డాట్ కామ్ ఆన్‌లైన్ నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ చేసి చైల్డ్ ఇన్ఫో డాట్ కాంలో నమోదు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 10 పాసైన ప్రతి విద్యార్థి ఇంటర్‌లో ప్రవేశం పొందేలా చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో ఒకటో తరగతి నుంచి పదో తరగతుల వరకు 2,70,000 మంది విద్యార్థులు ఉండగా 2,58,000 విద్యార్థుల ఎన్‌రోల్ అయిందన్నారు. మిగిలిన ఐదు శాతం కూడా ఎన్‌రోల్ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఇంటర్ మొదటి సంవత్సరానికి చాలా మంది విద్యార్థులు జాయిన్ కావడం లేదన్నారు. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్‌లు, విద్యాశాఖ అధికారులు అడ్మిషన్ల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. జిల్లాలో 130 కాలేజీలకు 50 కాలేజీలు మాత్రమే విద్యార్థులు మొదటి సంవత్సరం చేరినట్లు ఎన్‌రోల్‌మెంట్ చేశారన్నారు. మిగిలిన కళాశాలలో కూడా ఎన్‌రోల్‌మెంట్ చేయాలన్నారు. డేటా ఎంట్రీ చేయని కాలేజీల వారీగా సంబంధిత ప్రిన్సిపాల్‌ను వివరాలు అడిగి తెలుసుకుని రెండు రోజుల్లో డేటా ఎంట్రీ చేయాలని ఆదేశించారు. డీవీఈఓ కృష్ణయ్యనాయక్, ఆర్ఐఓ రవి, డీఈఓ పురుషోత్తం పాల్గొన్నారు.

పనులు త్వరగా చేయాలి

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పరిధిలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియంను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణం శివారు ప్రాంతంలో జరుగుతున్న క్రికెట్ స్టేడియం పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

అల్లూరికి ఘన నివాళి



రాయచోటి: అల్లూరి సీతారామరాజు ఉద్యమస్ఫూర్తి చిరస్మరణీయమని కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. మంగళవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు దేశభక్తి, ధైర్యసాహసాలు, త్యాగనిరతి యువతకు స్ఫూర్తిదాయక ఆదర్శాలని కలెక్టర్ కొనియాడారు. డీఆర్ఓ సత్యనారాయణ, కలెక్టర్ ఏఓ బాలకృష్ణ, సమాచారశాఖ డీపీఆర్ఓ పురుషోత్తం, కలెక్టర్ సెక్షన్ సూపరిటెండెంట్లు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, పలువురు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

కల్యాణ వైభోగమే..

- వైభవంగా సౌమ్యనాథుని కల్యాణోత్సవం
- పోటెత్తిన భక్తులు
- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే మేడా



శ్రీదేవి,భూదేవిలతో సౌమ్యనాథుడు కళ్యాణోత్సవం



పాల్గొన్న భక్తజనం

నందలూరు(రాజంపేట) : నందలూరు సౌమ్యనాథాలయంలో మంగళవారం సౌమ్యనాథుని కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థాన ఆధ్వర్యంలో విలీనం తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో కళ్యాణోత్సవమిది. టీటీడీ వేదపండితులు, అర్చకస్వాములు కళ్యాణోత్సవ క్రతువును క్రమంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులతో ఆలయ ఆవరణం నిండుగా కళకళలాడింది. డీఎస్పీ చైతన్య ఆధ్వర్యంలో సబ్‌డివిజన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముత్యాల తలంబ్రాలను సమర్పించిన ఎమ్మెల్యే మేడా

సౌమ్యనాథుని కల్యాణానికి రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ఈయనకు ఆలయంలో అర్చకులు పూర్ణకుంభభ స్వాగతం పలికారు. ఈయన వెంట ఎంపీపీ మేడావిజయభాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు మేడా మధుసూదనరెడ్డి, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, జెడ్పీటీసీ గడికోటఉషా సుబ్బారెడ్డి, సినీ నటుడు తోటవేణు, మాజీ చైర్మన్ సౌమిత్రి, నాగిరెడ్డి పల్లె సర్పంచి జంబు సూర్యనారాయణ పాల్గొన్నారు. అలాగే కడప ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, మాజీఎంపీపీ పల్లెమణ్యంతోపాటు పలువురు రాజకీయనాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రథోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈమేరకు రథాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం 9గంటల నుంచి 10 గంటల వరకు రథోత్సవం కార్యక్రమం నిర్వహించేందుకు టీటీడీ అన్ని సన్నాహాలు పూర్తి చేసింది.

గజరాజుపై యుగరాజు

నందలూరు(రాజంపేట): సౌమ్యనాథుడు గజవాహనంపై ఊరేగారు. ఉత్సవ మూర్తియై భక్తులను కరుణించారు. సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి సౌమ్యనాథుడు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా వాహనమండపంలో సౌమ్యనాథస్వామి ఉత్సవమూర్తిని సుందరంగా అలంకరించారు. అనంతరం గజవాహనంపై కొలువుదీర్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు సాయి నేతృత్వంలో అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



గజవాహనంపై ఊరేగుతున్న సౌమ్యనాథుడు



మదనపల్లె మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చిన టమాటా

టమాటా.. కిలో రూ.140

- మదనపల్లె మార్కెట్ చరిత్రలో అత్యధిక ధర
- ఒకరోజు వ్యవధిలో కిలోపై రూ.36 పెరుగుదల
- రోజురోజుకీ తగ్గిపోతున్న దిగుబడులు
- రైతుబజార్లలో కిలో రూ.50కు విక్రయించేలా ప్రభుత్వం చర్యలు

మదనపల్లె : రోజురోజుకీ పెరుగుతున్న టమాటా ధరలు మంగళవారం ఏకంగా ఆకాశాన్ని తాకాయి. అన్నమయ్య జిల్లా మదనపల్లె మార్కెట్ చరిత్రలో ఇప్పటివరకు ఎప్పుడూ పలకనంతగా మొదటిరకం టమాటా కిలో రూ.140 ధర పలికి ఆల్‌టైమ్ రికార్డ్ సృష్టించింది. గత శుక్రవారం మార్కెట్లో నమోదైన కిలో రూ.124 ధర అత్యధికమని ఇప్పటివరకు భావిస్తుంటే, మంగళవారం దాన్ని తలదన్నేలా కిలో రూ.140కు చేరుకోవడంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పెరుగుతున్న టమాటా ధరలతో రైతులు ఆనందపడుతున్నప్పటికీ, వినియోగదారులు మాత్రం ఆచితూచి కొనుగోలు చేస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. మదనపల్లె మార్కెట్లో వారం రోజుల టమాటా ధరలను పరిశీలిస్తే సరిగ్గా 13 రోజుల క్రితం మొదటిరకం టమాటా కిలో రూ.38 ధర పలికి.. రోజురోజుకూ ఊహించనిరీతిలో పెరిగి రూ.140కు చేరుకోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దేశంలో టమాటా పండించే రాష్ట్రాల్లో పంట దిగుబడులు లేకపోవడంతో అందరిచూపు ఏడాది పొడవునా క్రయవిక్రయాలు జరిగే మదనపల్లె మార్కెట్‌వైపు పడింది. బయటి రాష్ట్రాల వ్యాపారులు మదనపల్లెలో మకాం వేసి వచ్చిన సరుకు వచ్చినట్లుగా కొనేస్తుండటంతో పోటీపెరిగి ధరలు పెరిగాయి. దీనికితోడు దిగుబడులు తగ్గిపోవడం, వర్షాలతో పంటకు నష్టం వాటిల్లుతుండటంతో టమాటాకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగిపోయింది. ప్రస్తుతం మదనపల్లె మార్కెట్ నుంచి ఢిల్లీ, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాలకు సరుకు ఎగుమతి అవుతోంది. మార్కెట్‌కు సోమవారం రైతులు తీసుకువచ్చిన టమాటాకు మొదటి రకం కిలో రూ.104 ధర పలికితే మరుసటిరోజు మంగళవారం ఏకంగా కిలోపై రూ.36 పెరిగి రూ.140కు చేరుకుంది. మార్కెట్లో టమాటా ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో పలు మార్కెట్‌యార్డుల్లో వేలంపాటల్లో రైతుల నుంచి టమాటాలు కొనుగోలు చేస్తోంది. వాటిని రైతుబజార్లకు తరలించి రాయితీధరపై కిలో రూ.50కు అమ్మేలా చర్యలు తీసుకుంది.

క్లుప్తంగా

సౌమ్యనాథున్ని దర్శించుకున్న జిల్లా ఎస్పీ

నందలూరు (రాజంపేట) : సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం జిల్లా ఎస్పీ గంగాధరరావు స్వామివారిని దర్శించుకున్నారు. ఎస్పీకి ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. టీటీడీ అర్చక స్వాములు తీర్థప్రసాదాలను అందచేశారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ చైతన్య, సీఐ పుల్లయ్య ఉన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడు మృతి

మదనపల్లె : రోడ్డుదాటుతున్న వృద్ధుడిని లారీ ఢీకొనగా మృతి చెందిన సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బర్మా వీధికి చెందిన బలరామయ్య(70) ఇతరులకు బాకీ తీర్చేందుకుగాను అన్నమయ్య కూడలి వద్దకు వెళ్లాడు. తిరిగి వస్తూ రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన లారీ ఢీ కొంది. దీంతో అధిక రక్తస్రావం కావడంతో బాధితుడు అపస్మారస్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతునికి భార్య బాలచంద్రిక, ముగ్గురు సంతానం ఉన్నారు.

బైకు, మినీ వ్యాన్ ఢీ

పుల్లంపేట : కడప-చెన్నై జాతీయ రహదారి పుల్లంపేట బైపాస్‌లో మంగళవారం బైకు, మినీ వ్యాన్ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాషవాండ్లపల్లికి చెందిన పుల్లయ్య, అన్నయ్య అనే వ్యక్తులు ద్విచక్రవాహనంలో పుల్లంపేటకు వచ్చారు. ఈ క్రమంలో ఫుల్లంపేట బైపాస్ సమీపంలో రోడ్డు దాటుతుండగా మినీ వ్యాన్ ఢీ కొంది. దీంతో ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సంమస్యల కారణంగా భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మదనపల్లెలో మంగళవారం జరిగింది. మదనపల్లె పట్టణ సమీపంలోని సత్యసాయికాలనీ (ఇసుకనూతనపల్లె)కు చెందిన యు.రెడ్డి (32) భవన నిర్మాణ కార్మికుడిగా వైఎస్సార్ కాలనీలోని వేణు మేస్త్రీ వద్ద పని చేస్తున్నాడు. వారం రోజులుగా అక్కడే ఉంటున్నాడు. అయితే కుటుంబ సమస్యల కారణంగా ఉంటున్న చోటే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఘర్షణలకు పాల్పడితే బైండోవర్ కేసులు

గంగమ్మ జాతర నిర్వాహకులకు
జిల్లా ఎస్పీ గంగాధర రావు హెచ్చరిక


జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని నిర్వాహకులకు సూచిస్తున్న ఎస్పీ గంగాధరరావు

రాజంపేట టౌన్ : బలిజపల్లె గంగమ్మ జాతర విషయంలో నిర్వాహకులు ఘర్షణలకు పాల్పడితే బైండోవర్ కేసులు పెడతామని జిల్లా ఎస్పీ గంగాధరరావు హెచ్చరించారు. రాజంపేట పట్టణం బలిజపల్లెలో మంగళవారం ఎస్పీ గంగమ్మజాతర నిర్వాహకులు, ప్రజలతో సమావేశమై జాతరను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆదేశించారు. ఒక్కసారి బైండోవర్ కేసు నమోదైతే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. ఎన్నికల సమయంలో అలాగే ఎప్పుడైనా శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు బైండోవర్ కేసులున్న వారందరిని పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తుంటారని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లాలనుకున్నా వెళ్లలేని పరిస్థితులు ఉంటాయన్నారు. అందువల్ల ఎవరు కూడా వివాదాల జోలికి వెళ్లకుండా అందరు సమష్టిగా అన్నదమ్ముల్లా కలిసి మెలసి జాతరను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. జాతర సమయంలో ఎంతటి వారైనా ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే ఉపేక్షించే ప్రసక్తి ఉండదని హెచ్చరించారు. తాను కూడా జాతరలో పాల్గొని గంగమ్మను దర్శించుకుంటానని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ వీఎన్‌కే చైతన్యకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఎస్పీ గంగమ్మకు పూజలు నిర్వహించి కొబ్బరికాయ సమర్పించి, ఎంతో విశిష్టత కలిగిన బలిజపల్లె గంగమ్మను దర్శించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.

ఎమ్మెల్యే చొరవతో కదిలిన పోలీస్ అధికార యంత్రాంగం

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో బలిజపల్లె గంగమ్మ జాతర రెండవ పెద్ద జాతరగా ప్రసిద్ధి గాంచింది. అయితే నిర్వాహకుల మధ్య సాంగ్యాల విషయంలో వివాదాలు తలెత్తడంతో ఈ ఏడాది ఏకంగా జాతర నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో అనేక మంది భక్తులు, ప్రజలు ఇటీవల ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిని కలిసి జాతర నిర్వహణకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించి జూలై రెండవ వారంలోపు జాతరను ఎట్టి పరిస్థితుల్లో నిర్వహించాలని డీఎస్పీ చైతన్యను ఆదేశించారు. దీంతో డీఎస్పీ రంగంలోకి దిగి జాతర నిర్వహణకు మార్గం సుగమం చేశారు. దీంతో ఈనెల 13న గంగమ్మ జాతర నిర్వహణకు పోలీసు అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే చొరవతో జాతర జరగనుండటంతో గంగమ్మ భక్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

అండర్-19 క్రికెట్ టోర్నీలో అగ్రస్థానంలో కడప జట్టు


తలపడుతున్న కడప, అనంతపురం జట్లు


ప్రణీల్, కడప బ్యాట్స్‌మన్ 54 పరుగులు


సాయిఅర్థిత్‌రెడ్డి కడప బౌలర్ 3 వికెట్లు


మహమ్మద్ అయూబ్ కడప బౌలర్ 4 వికెట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహించిన ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జట్టు అగ్రస్థానంలో నిలిచింది. మంగళవారంతో టోర్నమెంట్ ముగియగా పాయింట్ల పట్టికలో 12 పాయింట్లతో కడప జట్టు అగ్రస్థానంలో నిలువగా, అనంతపురం 8 పాయింట్లతో రెండోస్థానంలో నిలిచింది. కాగా మంగళవారం వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 44.2 ఓవర్లలో 158 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని వీరారెడ్డి 35 పరుగులు, లోహిత్‌సాయి కృష్ణ 34 పరుగులు చేశారు. కడప బౌలర్లు మహమ్మద్ అయూబ్ 4, సాయిఅర్థిత్‌రెడ్డి 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 44 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని ప్రణీల్‌రెడ్డి 54 పరుగులు చేశాడు. దీంతో కడప జట్టు 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

కర్నూలు జట్టు విజయం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో కర్నూలు, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 49.5 ఓవర్లలో 210 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని సాయిసూర్యతేజారెడ్డి 66 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు బ్రహ్మతేజారెడ్డి 2, రాజ్‌దీప్ 2, నవీద్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 38 ఓవర్లలో 151 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని లోహిత్ లక్ష్మీనారాయణ 42 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ విష్ణువర్ధన్ 5 వికెట్లు తీశాడు. దీంతో కర్నూలు జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

మెడికల్ కాలేజీకి శరీరదానం

ప్రొద్దుటూరు క్రైం : చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీ మాజీ ఉద్యోగి పూడూరు నరసింహారెడ్డి (75) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలతో పాటు మృతదేహాన్ని కడప రిమ్స్ మెడికల్ కాలేజీకి అందజేశారు. నరసింహారెడ్డి ప్రొద్దుటూరులోని గీతాశ్రమం వీధిలో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె విప్లవ రచయితల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి వరలక్ష్మీ ప్రొద్దుటూరులో ఉండగా, కుమారుడు రామనాథరెడ్డి హైదరాబాద్‌లో ఉంటున్నారు. నరసింహారెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఈ క్రమంలో ఆయన ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి ఇవ్వడం స్ఫూర్తిదాయకమని పలువురు కొనియాడారు.

దేశభక్తికి నిలువెత్తు రూపం అల్లూరి సీతారామరాజు

రాయచోటి: నమ్మిన సిద్ధాంతాలతో పోరుబాటలో నడిచిన మార్గదర్శకుడు, పోరాటపటిమకు, దేశభక్తికి నిలువెత్తు రూపం అల్లూరి సీతారామరాజు అని జిల్లా ఎస్పీ గంగాధర్ రావు అన్నారు. మంగళవారం అన్నమయ్య జిల్లా, రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణంలో అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని అల్లూరి చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి సెల్యూట్ చేసి నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన అనేక మందిలో మన్యం వీరుడు అల్లూరి ఒకరన్నారు. గిరిజన సైన్యంతో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు నడిపిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ విబి రాజ్ కమల్, డీపీఓ మినిస్టీరియల్ సిబ్బంది, ఎస్ఐ, ఏఆర్ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది పాల్గొని అల్లూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.


అల్లూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎస్పీ గంగాధర్ రావు

బారికేడ్లను ఢీకొని ద్విచక్రవాహనదారులకు గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన ద్విచక్రవాహనదారుడు

రామాపురం : కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం నీలకంఠ్రావుపేట పంచాయతీ ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను ఢీకొన్న సంఘటనలో ఇద్దరు ద్విచక్రవాహనదారులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ రాచపల్లికి చెందిన రాజగోపాల్ రెడ్డి మంగళవారం రామాపురం నుంచి గువ్వలచెరువుకు బైకుపై వెళ్తూ ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద ఆగాడు. ఇంతలో వెనుక వైపు నుంచి రాయచోటి పట్టణం ఎస్ఎన్‌కాలనీకి చెందిన సదాశివ బైకుపై రాయచోటి నుంచి కడపకు వెళ్తూ మార్గమధ్యంలో రామాపురం మండల ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను ఢీ కొన్నాడు. ఇదే సమయంలో పక్కనే ఆగి ఉన్న బైకును కూడా ఢీకొనడంతో సదాశివ, రాజగోపాల్‌రెడ్డి ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని పోలీసు వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

కాలుష్య గ్రామాల ప్రజలకు మెరుగైన పునరావాసం


ముక్కవారిపల్లి పంచాయతీలో భూముల లేఅవుట్‌లను పరిశీలిస్తున్న ఫర్మాన్ అహ్మద్ ఖాన్

ఓబులవారిపల్లె : మంగంపేట, కాపుపల్లి, హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాల ప్రజలకు మెరుగైన పునరావాసం, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. మంగళవారం మంగంపేట ఏపీఎండీసీ కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం ముక్కవారిపల్లి పంచాయతీలో కాలుష్య గ్రామాల ప్రజలకు పునరావాసం ఏర్పాటుకు లేఅవుట్‌లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కాలుష్య గ్రామాలను త్వరలో తరలించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో ప్రధానంగా లేఅవుట్‌లను సిద్ధం చేయాలని, అదే విధంగా తాగునీరు, డ్రైనేజీ కల్పన కోసం పూర్తిస్థాయిలో పనులు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఓ సుదర్శన్ రెడ్డి, తహసీల్దార్ పుల్లారెడ్డి, హౌసింగ్ డీఈ కుప్పుస్వామి, పంచాయతీరాజ్ డీఈ బాల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రాయచోటి : జీవకోటికి ఆధారమైన పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాతీయ వాతావరణ మార్పులు, మానవుని ఆరోగ్యం కార్యక్రమం నిర్వహణపై అన్ని శాఖల అధిపతులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారానే రేపటి తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతిని అందించగలుగుతామని చెప్పారు. అడవులు, జలవనరులు క్రమేపీ తగ్గిపోతున్నాయన్నారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వాతావరణంపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. మొక్కలు నాటడం, సైక్లింగ్ చేయడం, ప్లాస్టిక్‌కు దూరంగా ఉండటం, ఇంధన వాడకాన్ని తగ్గించడం ద్వారా మనవంతు బాధ్య తగా పర్యావరణాన్ని కాపాడుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య, ఎస్‌సీడీ అధికారి శేషగిరి బాబు, డీసీఎంఓ డాక్టర్ లోకవర్ధన్, డీఈఓ, పశుసంవర్ధక, పంచాయతీరాజ్, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెళ్లి చదివింపు డబ్బుతో విద్యార్థులకు బస్సు పాసులు


డీఎంకు చెక్కును అందజేస్తున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు

మదనపల్లె సిటీ: సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న హెల్పింగ్‌మైండ్స్ సంస్థ ఈసారి వినూత్నంగా పెళ్లి చదివింపుల సొమ్ముతో విద్యార్థులకు ఉచితంగా ఆర్టీసీ బస్సు పాసులు అందజేశారు. మదనపల్లె పట్టణం హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్ వివాహం ఆదివారం జరిగింది. మిత్రులు, బంధువులు పెళ్లికి చదివింపులు ఇచ్చారు. ఇందులో రూ.25 వేలు నగదును చెక్కు రూపంలో మదనపల్లె టు డిపో మేనేజర్ ఆర్‌సి నిరంజన్‌కు మంగళవారం ఆయన అందించారు. ఈ డబ్బుతో పేద,మధ్య తరగతి విద్యార్థులకు ఉచితంగా బస్సు పాసులు ఇవ్వాలని కోరారు. డీఎం హెల్పింగ్ మైండ్స్ సభ్యుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సభ్యులు ధంకన, అర్షద్, గౌతమ్, కిరణ్, అక్రం, మంజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ

- సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలన
- ఐదవ అంతస్తు నుంచి సోహిత్ మృతి చెందాడని నిర్ధారణ
- పాఠశాల యాజమాన్యం, సిబ్బందిపై కేసు
- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వెల్లడి




వివరాలు వెల్లడిస్తున్న వైఎస్సార్ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : ఖాజీపేట మండలం కొత్త నెల్లూరు గ్రామంలోని బీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈనెల 1వ తేదీన మామిడిశెట్టి సోహిత్ (11)మృతి చెందిన సంఘటనపై పోలీసులు సమగ్రంగా విచారణ చేపట్టారు. ఈ సంఘటనపై మంగళవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉన్న 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. పులివెందుల టౌన్ అహోబిలాపురం వీధికి చెందిన నాగరాజు, లలితల కుమారుడు మామిడిశెట్టి సోహిత్ (11) బీరం శ్రీధర్‌రెడ్డి స్కూల్‌లో జూన్ 19న ఆరవ తరగతిలో చేరాడు. ఈ విద్యార్థి ఈనెల1న తెల్లవారుజామున కడుపునొప్పిగా ఉందని చెప్పగా వెంటనే స్కూల్ యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. వారు వెంటనే చెన్నూరులో ఉన్న తమ సమీప బంధువులను స్కూల్ వద్దకు పంపి, వారి ద్వారా మామిడిశెట్టి సోహిత్‌ను చికిత్స కోసం చెన్నూరులోని ఆర్ఎంపీ డాక్టర్ వెంకటేష్ వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. రెండు గంటలైనా కూడా కడుపునొప్పి తగ్గకపోగా విద్యార్థి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి ఈనెల 1న ఉదయం 9:15 గంటలకు విద్యార్థి చనిపోయాడని నిర్ధారించారు. ఈ విషయమై విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఖాజీపేట పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్. 78/2023 అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మైదుకూరు రూరల్ సీఐ వై. నరేంద్ర రెడ్డి విచారణ చేపట్టారు.

సీసీ ఫుటేజీల ద్వారా తెలిసిన వాస్తవాలు

- ఈనెల 2న సోహిత్ మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించారు.
- జూన్ 30న రాత్రి 9:10 గంటలకు యూకేజీ పేరుతో ఉన్న కెమెరా ప్రకారం, చనిపోయిన సోహిత్ ఇతర విద్యార్థులతో కలిసి హాస్టల్ గదిలో హుషారుగా పడక ఏర్పాట్లు చేసుకున్నాడు.
- ఈనెల 1వ తేదీన ఉదయం 5:07 గంటలకు అదే కెమెరా ప్రకారం సోహిత్ ఒంటరిగా మంచంమీద నుంచి లేచి హాస్టల్‌లో ఇతర విద్యార్థులు నిద్రిస్తుండగా బయటకు వెళ్లాడు.
- ఉదయం 5:08 నిమిషాలకు కెమెరా 16 ప్రకారం సోహిత్ హాస్టల్ గది నుంచి వెలుపలికి వచ్చి పై అంతస్తుకు ఉన్న మెట్లను వేగంగా ఎక్కాడు.
- 5 గంటల 8 నిమిషాల 23 సెకెండ్లకు కెమెరా 10 ప్రకారం సోహిత్ పై అంతస్తులోని ఇనుప గేట్ వద్దకు రహస్యంగా వచ్చి ఎవరూ లేరని గమనించి అదే సమయంలో గేటు తెరిచి 5వ అంతస్తులోని టెర్రస్‌పైకి వెళ్లాడు.
- ఉదయం 5:09 గంటలకు కెమెరా 12 ప్రకారం సోహిత్ 5వ అంతస్తుకు చేరుకుని, ఆ అంతస్తు ప్రవేశ డిజిటల్ గేటు వద్ద అందుబాటులో ఉన్న కొద్దిపాటి పెద్ద రాయిని తన ఆలోచనకు ఉపయోగించుకోవడానికి ప్రయత్నించాడు. అది కుదరకపోవడంతో దానిని అక్కడే వదిలిపెట్టాడు.
- సోహిత్ 5వ అంతస్తులోని ప్రహరీ దగ్గర ఉన్న ఒక బకెట్‌ను బోర్లించుకుని గోడ ఎక్కాడు. ఆ గోడపై కాలు, పాదాల ముద్రలు ఉన్నాయి.
- ఉదయం 5:10 గంటలకు సోహిత్ హాస్టల్ భవనంలోని 5వ అంతస్తు గోడపై నుంచి కిందకు దూకాడు.
- భవనం మొదటి అంతస్తు దగ్గర 'వి' ఆకారంలో ఉన్న ఇన్సులేటెడ్ విద్యుత్ తీగలపై పడి ఆరు నుంచి 8 నిమిషాల పాటు వేలాడుతూ ఉన్నాడు. తరువాత 5:18 గంటలకు హాస్టల్ ఆవరణంలో నేలపై పడిపోయాడు. ఈ దృశ్యం స్కూల్‌లో కెమెరా నంబర్.1లో రికార్డయింది.
- కెమెరా నంబర్. 1 ప్రకారం సోహిత్ కింద పడిన తరువాత సుమారు 4 నిమిషాల పాటు అక్కడే పడుకుని ఉండిపోయాడు. ఉదయం 5:22 గంటలకు స్కూల్ సిబ్బంది రియాజ్ సోహిత్ పడి ఉండటం గమనించి, అతని వద్దకు పరుగెత్తి, ఇతర సిబ్బందితో కలిసి సోహిత్‌ను విచారించగా, తనకు కడుపునొప్పి అని తెలిపాడు. తన తండ్రి నాగరాజు ఫోన్ నెంబర్ చెప్పగా, వార్డన్ అంజి సోహిత్ తండ్రి నాగరాజుకు ఫోన్ ద్వారా విషయం తెలుపగా అతని మేనత్తను స్కూల్ వద్దకు పంపారు. ఆమె రావడంతో సోహిత్‌ను చికిత్స నిమిత్తం పంపారు. సీసీ ఫుటేజీల ద్వారా లభించిన సాక్ష్యాల ఆధారాంగా ఐదవ అంతస్తు నుంచి సోహిత్ కింద పడటం వల్లే మరణించాడని నిర్ధారణకు వచ్చారు. పాఠశాల యాజమాన్యం, సిబ్బందిపై జువైనల్ జస్టిస్ సెక్షన్ 75 కింద కేసు నమోదు చేసి, సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్, మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరు వైఎస్ఆర్ క్రాంతి పథంలో రూ.53.79 లక్షలు స్వాహా


వల్లూరు ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న మండల సమాఖ్య ప్రతినిధులు

వల్లూరు : వల్లూరు వైఎస్ఆర్ క్రాంతి పథంలో సుమారు 53.79 లక్షల రూపాయల మేర నిధుల దుర్వినియోగం జరిగింది. 2014 నుంచి 2023 వరకు మండలంలో పని చేసి ప్రస్తుతం కమలాపురం మండలంలో పని చేస్తున్న మండల సమాఖ్య సీసీ సునీత ఆమె సొంత బ్యాంకు ఖాతాలతో బాటు బంధువుల బ్యాంకు ఖాతాలకు నిధులను మళ్లించి దుర్వినియోగం చేసినట్లు అధికారులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. మండల సమాఖ్య నిధుల దుర్వినియోగం గురించి ఈ నెల 24 వ తేదీన పత్రికల్లో వార్త ప్రచురితమైంది. దీంతో పాటు మండలానికి చెందిన వీవోఏలు జిల్లా కలెక్టర్ విజయ రామరాజు, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డిలను కలిసి నిధుల స్వాహాపై వినతి పత్రాన్ని అందచేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ ముగ్గురు లీగల్ కో ఆర్డినేటర్లను దీనిపై విచారణకు నియమించారు. వారితో పాటు పీడీ స్వయంగా వల్లూరు మండల సమాఖ్య కార్యాలయానికి వచ్చి వీవోఏలతో పాటు సిబ్బందిని విచారించారు.

ఇసుక కమీషన్ నిధులు రూ.29.13 లక్షలు స్వాహా

ఇందులో స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి, ఇసుక కమీషన్‌లకు సంబంధించి మొత్తం 53. 79 లక్షల రూపాయలు దుర్వినియోగం అయినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. తప్పెట్ల - 1, తప్పెట్ల - 2, దుగ్గాయపల్లె మెయిన్, దుగ్గాయపల్లె -2, లేబాక -1, లేబాక -2, తొల్లగంగనపల్లె గ్రామ సమాఖ్యలకు సంబంధించి స్త్రీ నిధి నిధులు రూ 3.20 లక్షలు, సీఐఎఫ్ నిధులు రూ.21. 01 లక్షలు, ఉన్నతి నిధులు రూ.0.19 లక్షలు దుర్వినియోగం అయ్యాయని గుర్తించారు. అలాగే 2014 నుండి 2017 సంవత్సరం వరకు నడిచిన తప్పెట్ల ఇసుక రీచ్‌కు సంబంధించిన కమీషన్ నిధులు రూ 29.13 లక్షలు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. కాగా మొత్తం మీద అన్నీ కలిపి రూ 53.79 లక్షల నిధులు దుర్వినియోగం కాగా సదరు సీసీ ఇప్పటికే రూ. 5.08 లక్షలను చెల్లించారు. అవి పోనూ రూ. 47.99 లక్షలు చెల్లించాల్సి ఉన్నట్లు గుర్తించారు.

సీసీపై సస్పెన్షన్ వేటు..పోలీసు కేసు

నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సీసీ సునీతను సస్పెండ్ చేయడమే కాక పోలీసు కేసు నమోదు చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ జిల్లా సమాఖ్యను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా సమాఖ్య నుంచి మంగళవారం వల్లూరు మండల సమాఖ్య కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. జిల్లా సమాఖ్య ఆదేశాల మేరకు మండల సమాఖ్య మంగళవారం సమావేశం నిర్వహించి సీసీపై కేసు నమోదుకు తీర్మానించారు. ఈ మేరకు మండల సమాఖ్య అధ్యక్షురాలు గౌరీ దేవి, కార్యదర్శి ప్రమీల, కోశాధికారి సుభాషిణి, ఏపీఎం శైలజతో కలిసి వల్లూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ పెద్ద ఓబన్నకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులకు నివేదించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని ఎస్ఐ తెలిపారు.